ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 12 ఆగస్టు 2025 | 5



అమలాపురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు

‘ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి’ చొరవతో సమస్యలకు మోక్షం

- ‘అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా’కు స్పందన
- నేడు రాజమహేంద్రవరం 9వ డివిజన్‌లో సభ
- ముఖ్యఅతిథిగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ‘ఏబీఎన్-ఆంధ్రజ్యోతి’ ప్రజల సమస్యలపై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం చక్కటి ఫలితాలను ఇచ్చింది. ‘అక్షరమే అండా.. పరిష్కారమే అజెండాగా’ అనే నినాదంతో ఈ ఏడాది జనవరి 28వ తేదీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో శ్రీవేంకటేశ్వర నగర్‌లోని ఐఎంఎ హాల్‌లో ప్రజల సమక్షంలో సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తోపాటు 9వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ చండీప్రియ, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 9వడివిజన్ పరిధిలో నివసించే అనేకమంది సభకు వచ్చి అపరిష్కృతంగా ఉన్న తమ ప్రాంత సమస్యలు ఏకరవుపెట్టారు. ఇవన్నీ విన్న ఎమ్మెల్యే వాసు కొద్దిరోజుల్లో ఇక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధ్వానంగా ఉన్న పారిశుధ్య సమస్య అప్పటికప్పుడే పరిష్కారమైంది. విద్యుత్ లోవోల్టేజీ సమస్యపరిష్కారం కాగా, వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావస్తోంది. అప్పట్లో కల్వర్టుల పేరుతో నెమ్మదిగా జరుగుతున్న పనులన్నీ పూర్తయ్యాయి. రూ.10 కోట్లతో 32ముఖ్యమైన పనులు పూర్తయ్యాయి. అందులో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పార్కులు ఉన్నాయి. వైసీపీ హయాంలో ఆగిపోయిన ఐఎంఏ హాల్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈనేపథ్యంలో ‘ఏబీఎన్-ఆంధ్రజ్యోతి వేంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏహాల్‌లో మంగళవారం సాయంత్రం 4గంటలకు సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది.



అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో 500 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టిన విద్యార్థులు, ఉద్యోగులు



ఉచిత బస్సులు రెడీ!

- సూపర్-6లో స్త్రీశక్తి పథకం అమలుకు సర్వం సిద్ధం
- ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో 195 బస్సు సర్వీసులు
- డ్రైవర్లు, కండక్టర్లకు ఫ్రీ టికెట్లపై శిక్షణ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్-6 పథకాల్లో ఒకటైన అత్యంత మహిళల ప్రజాదారణ కలిగిన స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు ఈనెల 15 నుంచి ప్రారంభించడానికి ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

డిపోల పరిధిలో ఉన్న బస్సులన్నింటికీ మరమ్మతులు పూర్తి చేసి సిబ్బందికి ఫ్రీ టిక్కెట్ విధానం అమలుపై శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులన్నీ కండిషన్‌లో ఉండేందుకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకుని ముందస్తు ఏర్పాట్లు చేయడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ప్రజారవాణాశాఖ ముందంజలోనే ఉంది. జిల్లావ్యాప్తంగా ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 195 బస్సుల ద్వారా వర్తింప చేసేందుకు సర్వ సన్నద్ధం చేశారు. మహిళా ప్రయాణికుల రద్దీకి తగట్టు సర్వీసులను నడిపేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా సిబ్బందికి ఫ్రీ టికెట్ విధానంపై శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

జిల్లావ్యాప్తంగా 195 సర్వీసుల్లో ఉచితం

సీఎం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల వ్యవధిలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు కోసం స్త్రీ శక్తి పథకాన్ని ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి ప్రారంభించనున్నారు. కోనసీమ జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో 195 బస్సులు ఇందు కోసం నడపనున్నారు. వీటిలో అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రా పల్లెవెలుగు, పల్లె వెలుగులకు సంబంధించి 64 బస్సులను వివిధ రూట్లలో నడపడానికి సిద్ధం చేశారు. రామచంద్రపురం డిపో పరిధిలో ఆల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు బస్సులు 49, రావులపాలెం డిపోలో 9 ఆల్ట్రా పల్లె వెలుగు, 40 పల్లె వెలుగు వెరసి 49 బస్సులు నడపనున్నారు. రాజోలు డిపోలో మూడు ఆల్ట్రా పల్లె వెలుగు, 30 పల్లె వెలుగు వెరసి 33 బస్సులు నడిపేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఆర్టీసీ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్టీపీ రాఘవ కుమార్ కొన్ని ప్రణాళికలు సిద్ధం చేసి ముందడుగు వేశారు. నాలుగు డిపోల పరిధిలోఉన్న బస్సుల మెయింటెన్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టడంతోపాటు నూతన మెయింటెన్స్ విధానం అమలు ద్వారా అన్నిబస్సుల కండిషన్‌ను పరిశీలించి కావాల్సిన విడిభాగాలు, టైర్లు సమకూరుస్తున్నారు. ఇప్పటికే రీజనల్ టెండర్ల ద్వారా అన్ని కేటగిరీల్లో ఉన్న ఖాళీలను ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా భర్తీ చేసుకున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 80శాతం బస్సులను సిద్ధం చేసినట్టు తెలిపారు. కొత్త బస్సుల ద్వారా రీప్లేస్‌మెంట్ అయిన సూపర్‌లగ్జరీ, ఆల్ట్రాడీలక్స్ బస్సులను 20 వరకు పల్లె వెలుగుబస్సులుగా కన్వర్షన్ చేయించారు. బాడీ ఓవర్ ఆయిలింగ్ ద్వారా కండిషన్‌ను మెరుగు పరిచారు. మహిళల ఉచిత బస్సు సర్వీసుల ప్రారంభదశలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే ఊహించి అందుకు తగిన రీతిలో డ్రైవర్లు, కండక్టర్లకు వారంరోజులుగా సూచనలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ పథకం ప్రారంభ సమయంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నా విజయవంతంగా మహిళలకు సేవలందించడానికి మాత్రం ఏపీఎస్ఆర్టీసీ సర్వసన్నద్ధమైంది.


అమలాపురంలో బస్సుల కండిషన్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం



జిల్లావ్యాప్తంగా ఈనెల15 నుంచి మహిళల ఉచిత బస్సు ప్రయాణాల దృష్ట్యా ఫ్రీ టికెట్లు ఇవ్వడానికి కండక్టర్లకు నూతన సాఫ్ట్‌వేర్‌పై శిక్షణఇచ్చాం. టిమ్‌మిషన్ ట్రైనింగ్‌లను నిర్వహిస్తున్నాం. గ్యారేజీ సిబ్బందికి, డ్రైవర్లకు, కండక్టర్లకు గేట్ మీటింగ్‌ద్వారా ఎప్పటికప్పుడు రాబోయేరద్దీని దృష్టిలోపెట్టుకుని అంతర్గతంగా చేయాల్సిన మార్పులను తెలియచేస్తున్నాం. మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణంలో ఏ ఇబ్బందులు రాకుండా బస్‌స్టేషన్‌లో అన్నిరకాల ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ స్త్రీశక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవడమే కాకుండా ప్రయాణ సమయంలో ఆర్టీసీ సిబ్బందికి సోదర భావంతో సహకారం అందించండి.

-రాఘవకుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి

500 అడుగుల జాతీయ జెండాతో..

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

- ప్రతి పౌరుడు ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలి
- ర్యాలీలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు పిలుపు

అమలాపురం/అమలాపురంటౌన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ప్రతి భారతీయుడు దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటేందుకు జాతీయ పతాకాన్ని తమ ఇళ్లపై ఎగురవేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం అమలాపురం పురపాలక సంఘ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీని 500 అడుగుల జాతీయ పతాకంతో మున్సిపల్ కార్యాలయంనుంచి గడియార స్తంభం వరకు నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 15 వరకు తిరంగ కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్రం ఈ కార్యక్రమాలు ప్రారంభించిందని తెలిపారు. దీని ద్వారా ప్రజల్లో దేశంపట్ల ప్రేమ, గౌరవం, దేశ భక్తి పెరుగుతుందన్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ జాతీయ జెండాతో మనకున్న అనుబంధాన్ని కేవలం అధికార కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిగతమైన, హృదయపూర్వకమైన అనుబంధంగా మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కదలివచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు

500 అడుగుల జాతీయ పతాకాన్ని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, పురపాలక సంఘ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పురపాలక సంఘ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో భారీ జాతీయ పతాకంతో నిర్వహించిన మానవహారం అందరినీ ఆకట్టుకుంది. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్‌తోపాటు డీఈ సత్యనారాయణ, తహశీల్దార్ అశోక్ ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

మండపేటలో ర్యాలీ


మండపేట పట్టణంలో 500 అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కూటమి నేతలు, విద్యార్థులు


కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

పీజీఆర్ఎస్‌లో 167 అర్జీలు

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల సమస్యలను నిర్ణీత గడువులోగా సంతృప్తే కొలమానంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వివిధశాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో సోమవారం ప్రజాసమస్యలపరిష్కార వేదిక నిర్వహించారు. జేసీ టి.నిషాంతి, ఇన్‌చార్జి డీఆర్‌వో కొత్త మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మి, ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి, డీఎస్వో ఉదయభాస్కర్‌లతో కలిసి కలెక్టర్ వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారి నుంచి 167 అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీకి 25 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఫిర్యాదుదారులనుంచి అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖిగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై ఎస్పీ కృష్ణారావు 25అర్జీలను స్వీకరించారు. నిర్ణీత సమయంలో ఫిర్యాదుల పరిష్కారంపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో ఎస్పీ కార్యాలయానికి అందించాలన్నారు.

సంక్షేమ బాటలో రైతులు

- కూటమి ప్రభుత్వం రైతును మహారాజులా చూస్తోంది
- రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- మలికిపురంలో రైతు కృతజ్ఞత ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్సీ రాజశేఖరం

మలికిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులను సంక్షేమ బాటలో నడిపిస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండలం లక్కవరంలో సోమవారం రైతు కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవతోపాటు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నియోజకవర్గ పరిశీలకులు చిటికెన రామ్మోహనరావు పాల్గొన్నారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100మంది రైతులు ట్రాక్టర్లతో లక్కవరంలోని వేణుగోపాల్ థియేటర్‌నుంచి గాంధీబొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్‌డీఏ కూటమి నాయకులు హామీ ఇచ్చిన సూపర్-6 పథకాల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఇందులో భాగంగా పెంచిన సామాజిక పింఛన్లను ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేసిందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల డబ్బులు దశలవారీగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. తల్లికి వందనం ప్రజలకు మాట ఇచ్చిన విధంగానే ఇంట్లో బిడ్డలందరికీ రూ.15వేలు చొప్పున జమ చేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్రం, రాష్ట్రం కలిపి రైతుల ఖాతాలో మొదటి విడతగా రూ.7వేల చొప్పున జమ చేశామన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా భావించే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాని మోదీ రాబోయే రోజుల్లో మరింత అండగా నిలవనున్నారన్నారు. ఇప్పటికే రైతులకు పవర్ టిల్లర్లు, వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలను సబ్సిడీపై అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం రైతును ఒక మహారాజులా చూస్తోందని చెప్పారు. ఎమ్మెల్సీ రాజశేఖరం మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రైతులు దగా పడ్డారన్నారు. వ్యవసాయానికి నీరు అందజేయలేదని, కాల్వల్లో పూడికలు తీయలేదని, పండించిన ధాన్యాన్ని కొనలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాగానే రైతుల బకాయిలు రూ.15వేలకోట్లను చెల్లించిందన్నారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, గుబ్బల శ్రీనివాస్, మంగెన భూదేవి-నాని, చాగంటి స్వామి, అడబాల యుగంధర్ పాల్గొన్నారు.



ర్యాలీలో ఎద్దుల బండిపై ఊరేగుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ రాజశేఖరం.. మలికిపురం సెంటర్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

వివిధ అంశాలపై ఆర్డీవోలతో కలెక్టర్ సమీక్ష

అమలాపురం,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో జరిగిన ఆర్డీవోల సమావేశంలో ఆదేశించారు. పీ-4 ద్వారా మార్గదర్శకులకు బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చే ప్రక్రియ, అందరికీ ఇళ్లు, రీసర్వే, రహదారి భద్రతా చర్యల్లో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత కేలెండర్ ప్రకారం చేపట్టి లక్ష్యాలు సాధించాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, కృత్రిమ కొరతను సృష్టించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. జేసీ నిషాంతి, డీఆర్వో మాధవి, ఆర్డీవోలు అఖిల, శ్రీకర్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):మద్యం షాపులతోపాటు బార్లలో కల్లుగీతకార్మికులకు 10శాతం కోటా ఇచ్చివారి ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. కల్లుగీత కార్మికులతో కలిసి ఎమ్మెల్యే ఆనందరావు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసెల్ అధ్యక్షుడు పలివెల శ్రీనివాస్, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి రాజులపూడి భీముడు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి చినబాబు, మట్టపర్తి సాయిబాబా, అప్పారి సతీష్, పితాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ కార్యక్రమాల ప్రచార గోడపత్రికను కలెక్టర్ మహేష్‌కుమార్ సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు.హైరిస్క్‌మండలాల్లోని గ్రామాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి నివారణ, సమాజంలో నెలకొన్నఅపోహలు తొలగించేందుకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. ఎయిడ్స్‌పై అవగాహనకోసం కళాశాలలు, పాఠశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావుదొర, లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిణి సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ, డేటా మేనేజర్ సునీత, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమలాపురం మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

అమలాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. మార్కెట్ కమిటీ గౌరవ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఛైర్మన్‌గా అధికారి జయవెంకటలక్ష్మిని నియమించారు. వైస్‌ఛైర్మన్‌గా పరమట చిట్టిబాబు, సభ్యులుగా కంచిపల్లి శ్రీనాగ మహాలక్ష్మి, మల్లుల పుల్లయ్య, కొండా హేమనాగసూర్యకుమారి, నూకల వెంకటసుబ్బారావు, రేకాడి సత్యనారాయణవర్మ, మంద గెద్దయ్య, కాకిలేటి సత్యవతి, పేరూరి మీనాక్షి, ఎన్.భవానీ, మోటూరి సుభాషిణిదేవి, యాళ్ల ప్రభాకరరావు వెంకట గంగాధరరామారావు, పిల్లా శ్రీప్రసన్నాంజయులు, నాగిరెడ్డి సత్యనారాయణలను నియమించారు. వీరితోపాటు ఎన్.కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు, అమలాపురం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, అమలాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్, జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లు సభ్యులుగా ఉంటారు.

జోనల్‌స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


జోనల్‌స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో చంద్రశేఖర్

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జోనల్, రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సోమవారం అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో జిల్లా టీమ్ ఎంపికలు నిర్వహించారు. జిల్లా టీమ్ సెలక్షన్స్‌ను అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్ ప్రారంభించారు. త్వరలో జరిగే జోనల్, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పతకాలు తీసుకురావాలని విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ పప్పుల శ్రీరామచంద్రమూర్తి ఆకాంక్షించారు. అండర్-22 మహిళల విభాగంలో కొండేటి మేఘన, ఉందుర్తి శశికళ, యనమదల ఇందిరలను జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. పురుషుల విభాగంలో యిళ్ల మల్లిక్‌సాయి, జల్లి జితేంద్రదొర, కొండేటి వేణుమానస్, బి.యశ్వంత్‌కుమార్, కె.వరుణ్, డి.వేదేష్, డి.వేణుసాగర్, వి.మణికంఠలను ఎంపిక చేశామన్నారు. 11 మంది వెయిట్ లిఫ్టర్ల టీమ్‌ను జోనల్‌స్థాయి పోటీలకు పంపిస్తున్నట్టు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి పీఎస్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. డీఆర్కే నాగేశ్వరరావు, వి.నరేష్, జి.గణేష్‌బాబు, మారే వీరేంద్ర న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జోనల్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.



విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, వినయం, నిజాయితీలపై అవగాహన కల్పించడం, కుటుంబ విలువల ప్రాముఖ్యతను వివరించి వారిని సంస్కారంతో కూడిన విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు విలువల విద్య పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. వీటిని విద్యార్థులకు అందించడమే కాక ప్రతిరోజూ ఒక పీరియడ్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. నో బ్యాగ్ డే రోజున ఇదే అంశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా సూచనలు ఇచ్చారు.



చాగంటి వారి వాగ్భూషణం

- విద్యార్థులకు నైతిక విలువలు, వినయం, నిజాయితీలపై అవగాహన
- కుటుంబ విలువల ప్రాముఖ్యతను చాటిచెప్పేలా పాఠాలు
- 6 నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేకంగా పాఠ్య పుస్తకాలు
- ప్రతిరోజూ ఒక పీరియడ్ కేటాయింపు
- నోబ్యాగ్ డే రోజున విలువలపై కార్యక్రమాలు
- ఇవన్నీ ఎన్‌సీఈఆర్‌టీ దీక్ష యాప్‌లో
- క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పాఠాలు, వీడియోలు అందుబాటులోకి

DIKSHA - for School Education NCERT

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

విద్యా రంగంలో మార్పులకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పలు కొత్త అంశాలకు శ్రీకారం చుట్టింది. పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్చింది. విద్యార్థులకు విద్యతో పాటు అన్ని సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు నైతిక, కుటుంబ విలువలు, వినయం, నిజాయితీ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా 'విలువల విద్య' పేరుతో ఒక పుస్తకాన్ని రూపొందించే బాధ్యతను ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావుకు అప్పగించారు. ఇందుకోసం విద్యార్థులకు సంస్కారవంతమైన విషయాలపై అవగాహన కల్పించే విధంగా కొన్ని పాఠ్యాంశాలు, శతక సాహిత్యంలోని పద్యాలతో పొందుపరిచి 6 నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలను రూపొందించారు. వీటిని ప్రభుత్వం ముద్రించి ఇప్పటికే పాఠశాలలకు అందజేసింది. ప్రస్తుతం విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు.

ప్రత్యేకంగా పిరియడ్


విలువల విద్య పుస్తకాలను అందించడమే గాక వీటిని బోధించేందుకు ప్రతిరోజూ ఒక పీరియడ్ కేటాయించారు. ఆ పీరియడ్‌లో ఇందులోని అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. ప్రతి మూడవ శనివారాన్ని అన్ని పాఠశాలలు నో బ్యాగ్ డే గా పాటించాలన్న ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా విలువల విద్య పుస్తకంలోని అంశాలను కథల రూపంలో విద్యార్థులతో చెప్పించడం, చిన్నచిన్న స్కిట్స్ రూపంలో వాటిని ప్రదర్శించడం, అందులో పద్యాలు చదివించడం వంటి కార్యక్రమాలను నో బ్యాగ్ డే రోజున చేయనున్నారు.

స్కాన్ చేస్తే చాలు

విలువల విద్య కవర్ పేజీ నుంచి ప్రతి పాఠ్యాంశంపై ఒక క్యూఆర్ కోడ్‌ను పొందుపరిచారు. ఈ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయగానే దీక్ష వెబ్‌సైట్‌కి వెళ్లి ఆ పాఠ్యాంశం మనకు కనిపిస్తుంది. దీక్ష యాప్‌లో అయితే ఆ పాఠ్యాంశాన్ని డౌన్‌లోడ్ చేయడంతో పాటు అందుకు సంబంధించిన వీడియోలు ఉంటే ప్లే చేసుకోవచ్చు. ఇందునిమిత్తం ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో టీవీలు అందుబాటులో ఉన్నందున పాఠాలను వీడియోల రూపంలో ప్రదర్శించేందుకు ప్రయత్నించాలని సూచనలు జారీ అయ్యాయి.



విలువల విద్యలో అంశాల ద్వారా విద్యార్థుల్లో మంచి మార్పు వచ్చి సంస్కారంతో కూడిన విద్యావంతులుగా తయారు కావాలనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తేవడం మంచి పరిణామమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



చిన్న మాట- ప్రతిజ్ఞ

6 నుంచి 10వ తరగతి వరకు గల విలువల విద్య పుస్తకాల కవర్ పేజీ లోపలి భాగంలో ప్రభుత్వ గౌరవ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు చిన్న మాట ఉంది. 'విద్య అమూల్య ధనము... విద్యావంతులు గొప్ప అధికార స్థానాలను పొందుతారు... తద్వారా సమాజ హితానికి ప్రయత్నించడం సులభం' అని ఆయన చెప్పారు. విద్య సంస్కారాన్ని అందిస్తోందని, నైతిక విలువలు, వినయం, నిజాయితీ, కుటుంబ విలువలు తెలియకుంటే విద్యార్థులు విద్యావంతులు కాగలరు కానీ సంస్కారవంతులు అగుట కష్టమని అందులో వివరించారు. ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు సీఎం చంద్రబాబు సూచన మేరకు ఈ పుస్తకాలను రూపొందించినట్టు తెలిపారు. కవర్ చివరి పేజీ లోపల ప్రతిజ్ఞ పేరుతో దేశాన్ని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు అందరినీ గౌరవిస్తానని విద్యార్థులతో చేయించాల్సిన అంశాలు ఉన్నాయి.





6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న 'విలువల విద్య' పాఠ్య పుస్తకాలకు ప్రత్యేకంగా పేర్లు పెట్టారు.

తోరణం (6వ తరగతి): ఇందులో సాయం చేద్దాం, యోగ్యతకే అధికారం, సాటిలేని మేటి, నడత, గుణము, చిన్ననాటి నుంచి పాఠ్యాంశాలు ఉన్నాయి. డొక్కా సీతమ్మ చేసిన నిత్యాన్నదానం గురించి, కష్టపడి పనిచేసే స్వభావం అలవర్చుకోవడం, స్వభావరీత్యా చెడ్డవారైన వ్యక్తులను గౌరవించి సత్కరిస్తే ఏమి జరుగుతుంది, వివిధ రంగాల ప్రముఖుల చిన్ననాటి సంగతులను వివరించారు.

మనోవికాసం (7వ తరగతి): నిషిద్ధం, దృష్టికోణం, సుజనుడు, కుటుంబ విలువలు, దివ్యాంగులకు చేయూత, దృఢచిత్తం పాఠ్యాంశాలతో పాటు కొందరు ప్రముఖుల జీవిత చరిత్రల్లోని ముఖ్యాంశాలు, వారు చెప్పిన సూక్తులను పొందుపరిచారు.

సూక్తిసుధ (8వ తరగతి): ఓర్పుతో విజయం, అందమైన అలవాటు, సాయానికి సిద్ధం, శిక్షణ, దుర్గుణాలు, గౌరవం పాఠ్యాంశాలు

సద్గుణసారం (9వ తరగతి): కోపం-శాంతం, వాగ్భూషణం, సార్థకత, నాయకత్వం, అభివృద్ధిపథం, తస్మాత్ జాగ్రత్త ఇందులో పాఠ్యాంశాలు

అమృతధార (పదో తరగతి): విద్య-విలువ, సజ్జన సహవాసం, కీర్తి శరీరం, సహజ గుణాలు, నిందచెందకు, మాటతూలకు ఇందులోని పాఠ్యాంశాలు ఉన్నాయి.

విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన పెంచేందుకు దోహదం

బి.వెంకట శివప్రసాద్, ఎంఈవో-2, గొల్లప్రోలు



విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు విలువల విద్య పుస్తకాలు దోహదం చేస్తాయి. ప్రతిరోజూ ఒక పిరియడ్‌ను విలువల విద్యకు కేటాయించారు. 6 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. పలు అంశాలను ఉదాహరణలతో వివరించారు. ప్రముఖులు చెప్పిన మాటలు, వారి జీవితంలో ముఖ్య ఘటనలను పొందుపరిచారు. ఈ పుస్తకాల్లో ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.



మగ్గంపై నేసిన టస్సార్ పట్టు చీరను ప్రదర్శిస్తున్న గిరిజన మహిళలు

శభాష్

- టస్సార్ పట్టు చీరలు బాగున్నాయి
- గిరిజన మహిళలకు సీఎం చంద్రబాబు ప్రశంస



పైడిగూడెంలో టస్సార్ పట్టు చీరలు తయారు చేస్తున్న గిరిజన మహిళలు

కూనవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని పైడిగూడెంలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న టస్సార్ పట్టు చీరలు బాగున్నాయంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరు మండలం వంజంగి గ్రామంలో ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో ఈ పట్టు చీరలను ప్రదర్శించారు. పట్టు చీరలను మాత్రమే గిరిజను మహిళలు తయారు చేస్తున్నారని ప్రింటింగ్, డిజైన్ వర్కులను బయట చేయించాల్సి వస్తోందని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రింటింగ్, డిజైన్ వర్కుల్లో కూడా గిరిజన మహిళలకు శిక్షణ ఇవ్వాలని, వాటికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు తెలిసింది. నాణ్యమైన పట్టుచీరలు కాబట్టి వీటికి డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. గిరిజన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించడంలో శ్రద్ధ చూపిన చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే తొలిసారిగా కూనవరం మండలం పైడిగూడెంలో టస్సార్ పట్టుచీరల తయారీలో గిరిజన మహిళలకు శిక్షణ ఇచ్చారు. అంతకు ముందు ఇక్కడి గిరిజన మహిళలకు పట్టుకాయల నుంచి దారం ఎలా తీయాలో నేర్పారు. అనంతరం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మగ్గాలపై పట్టుచీరల తయారీలో శిక్షణ ఇచ్చారు. స్థానికంగా అడవుల్లో పండించే పట్టుతోనే ఇక్కడ చీరలు తయారుచేస్తున్నారు. చింతూరు డివిజన్ పరిధిలోని అడవుల్లో సుమారు 4వేల హెక్టారల్లో గల మద్ది చెట్లపై గిరిజనులు టస్సార్ పట్టు పురుగుల సాగు చేస్తుంటారు. తద్వారా సుమారు 1,600 మంది రైతులు, వెయ్యి కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. జూన్ నుంచి డిసెంబరు వరకు మూడు దఫాలుగా పట్టు పురుగుల సాగు చేస్తారు. ఒక్కో కుటుంబం రూ.40వేలు వరకు ఆదాయం పొందుతుంది. అధిక దిగుబడి వస్తే రూ.లక్ష కూడా వస్తుంది.



టస్సార్ పట్టు చీరలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (ఫైల్)

క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్

- విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్
- శ్రీప్రకాష్‌లో ముగిసిన అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత విజయప్రకాష్

తునిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):గత మూడు రోజులుగా శ్రీప్రకాష్ విద్యా సంస్థలలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 తెలుగు రాష్ట్రాల బాలబాలికల క్రీడాపోటీలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు ఉత్సవంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 180 కిపైగా జట్లు, 2000 మంది క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మూడు రోజుల నుంచి సుదూర ప్రాంతాల నుంచి గెలుపే లక్ష్యంగా ఆడి గెలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు నిత్యం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందుతారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకుడు సీహెచ్ ఎల్ఎం శ్రీనివాస్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి. ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎం.అపర్ణ, వివిధ ప్రాంతాలనుంచి హాజరైన విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో హాకీ టైటిల్ వార్

● ముఖ్య అతిథులుగా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ రాక

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ కోర్టు వేదికగా జరుగుతున్న 15వ హాకీ ఇండియా జూనియర్ నేషనల్ ఉమెన్ హాకీ ఛాంపియన్షిప్ - 2025 పోటీల క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ ముగించుకుని టైటిల్ వార్‌కి రంగం సిద్ధమయ్యింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూడోస్థానం కోసం ఉత్తరప్రదేశ్ వర్సెస్ ఛత్తీస్‌ఘడ్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అనంతరం మూడు గంటలకు టైటిల్ పోరుకు మిగిలిన రెండు జట్లు పోటీపడనున్నాయి. ఈ పోరు ముగిసిన తదనతరం బహుమతి ప్రదానోత్సవానికి కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందుమాధవ్, జేసీ రాహుల్ మీనా, తదితరులు హాజరుకానున్నారు. ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన హాకీ ఛాంపియన్షిప్‌లో 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వచ్చి పాల్గొన్నారు. దీంతో కాకినాడ పరిసర ప్రాంతాలు క్రీడాకారులతో సందడిగా మారాయి.

హాకీకి పెరిగిన ఆదరణ..

కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో ఆస్ట్రోటర్ఫ్ కోర్టులో జరుగుతున్న హాకీ ఛాంపియన్షిప్‌కి తగిన సౌకర్యాలు కల్పించారు. మన జాతీయ క్రీడా హాకీ కావడంతో స్కూల్, కాలేజ్ విద్యార్థులు సైతం మ్యాచ్‌లను చూసేందుకు తరలి రావడం ఇందుకు నిదర్శనం.

ఇప్పటికే నాలుగు జాతీయ స్థాయి పోటీలు జరగాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయం టోర్నమెంట్లు కూడా నిర్వహించుకునేలా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కలెక్టర్ చొరవచూపడంతో అవకాశాలు మెరుగుపడుతున్నాయి.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు పెద్దాపురం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో ఈనెల 27 నుంచి 29 వరకు జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకినాడ జిల్లా పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతిలో జరిగిన ఎంపికల్లో తెప్పల యోగేష్, సహస్ర, పాశిల లోకేష్ అర్హత సాధించారు. వీరిని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, దుండల పూజిత, సూర్యశ్రీ అభినందించారు.

3.14 లక్షల మంది పిల్లలకు

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

● జేడీ డాక్టర్ మల్లేశ్వరి



ద్రాక్షారామలో పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జేడీ డాక్టర్ మల్లేశ్వరి

ద్రాక్షారామ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డా.బి. ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లాలో 314930 మం ది పిల్లలకు ఆగస్టు 12న ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని లక్ష్యంగా పెట్టినట్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అమరావతి కార్యాలయ జేడీ డా.ఎస్.మల్లేశ్వరి తెలిపారు. సోమవారం ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు నమిలిమింగేటట్లు చూడాలన్నారు. జిల్లాలో 1726 అంగన్‌వాడీ కేంద్రాలు, 1582 ప్రభుత్వ పాఠశాలలు, 480 ప్రైవేటు పాఠశాలలు, 53 టెక్నికల్ అండ్ నాన్‌టెక్నికల్ కళాశాలల్లో 314930 మంది పిల్లలకు మాత్రలు మింగిస్తున్నామన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం, వంటశాలలను పరిశీలించారు. పిల్లలకు రక్తహీనతను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఆవశ్యకత గురించి తెలిపారు. అనంతరం మండాలమ్మపేట స్కూల్, అంగన్వాడీ సెంటర్లను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో హరి వెంకటేశ్వర్లు, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యులు డా.రత్నసుధ, జి.కమలేశ, డివిజనల్ సూపర్‌వైజర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు జానకమ్మ, వరలక్ష్మి, శ్రీనివాస్, ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫిబా ఆసియా ఉమెన్ కప్ పోటీలకు రిఫరీగా

రామచంద్రపురం క్రీడాకారుడు

● ఈనెల 13నుంచి మలేషియాలో మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు



డి.డేవిడ్‌రాజు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరుగనున్న ఫిబా ఆసియా ఉమెన్‌కప్ బాస్కెట్ బాల్ పోటీలకు రామచంద్రపురానకు చెందిన సీనియర్ క్రీడాకారుడు ధర్నాలకోట డేవిడ్‌రాజు ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19 వరకు మలేషియాలో ఫిబా ఆసియా ఉమెన్‌కప్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయి. రామచంద్రపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ క్రీడాకారుడు ధర్నాలకోట డేవిడ్‌రాజు రిఫరీగా ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు రిఫరీగా ఎంపికైన ధర్నాలకోట డేవిడ్‌రాజును గన్నమని చక్రవర్తి, డా.స్టాలిన్ అభినందించారు.

టీసీఐఎల్‌తో నన్నయ ఎంవోయూ

● నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



ఎంవోయూ పత్రాలు పరస్పరం మార్చుకుంటున్న అధికారులు

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం ఉష) పథకంలో భాగంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసే ల్యాబ్స్, సాంకేతిక సహకారం నిమిత్తం టెలీ కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్ (టీసీఐఎల్)తో ఎంవోయూ కుదుర్చుకున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలో సోమవారం వీసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, టీసీఐఎల్ ప్రతినిధి ఆదిత్య అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేసి పరస్పరం పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈ ఎంవోయూలో ప్రధానంగా డిజిటల్ కంటెంట్ అభివృద్ధి, వ్యాప్తి చేస్తూ 24 కోర్సులకు ఈ-కంటెంట్‌తో సహా అధిక నాణ్యత డిజిటల్ అభ్యాసన వనరులను రూపొందించడానికి మూక్ లెక్చర్ రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేయడానికి సహకరిస్తారన్నారు. విశ్వవిద్యాలయంతో బాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులకు నైపుణ్యాలను వృద్ధి చేయడానికి స్వయం, మూక్ వంటి జాతీయ వేదికల ద్వారా డెలివరీని సులభతరం చేయవచ్చునని అన్నారు. అలాగే స్మార్ట్ లెర్నింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తారని అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇంటరాక్టివ్ బోర్డులు, కంప్యూటర్ ప్రయోగశాలలు, హైస్పీడ్ వైఫై కనెక్టివిటీతో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేస్తారని చెప్పారు. పాఠ్యాంశాలు, సహపాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మిశ్రమ అభ్యాసం, డిజిటల్ అక్షరాస్యత, కంటెంట్ సృష్టిని ప్రోత్సహిస్తారన్నారు. ఇంకా దీని ద్వారా కలిగే అనేక ప్రయోజనాలను వివరించారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ డిమాండ్‌లను తీర్చడానికి లైఫ్‌సైన్సెస్, జియో సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ, వ్యవసాయశాస్త్రాలతో సహా వివిధ విభాగాల్లో కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ అప్లికేషన్‌లను ఏకీకృతం చేయడానికి వీలవుతుందని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, పీఎం ఉష కోఆర్డినేటర్ కే.రమణేశ్వరి, ప్రాజెక్టు మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఆచార్య కే.శ్రీరమేష్, ఆచార్య డీ.జ్యోతిర్మయి, అధ్యాపకులు వీ.పెర్సిస్, పీ.విజయనిర్మల పాల్గొన్నారు.

దొంగల ముఠా ఆట కట్టు

- నలుగురి అరెస్ట్
- రూ.45 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- సీఐ బృందానికి రూ.50 వేల రివార్డు
- వివరాలు వెల్లడించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు


రాజమహేంద్రవరంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎలాగైనా దోపిడీ చేయడమే వారి లక్ష్యం. గ్యాంగ్‌గా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారు. వాకిట్లో కల్లాపు వేస్తున్న మహిళల మెడలోని ఆభరణాలు సైతం లాగేస్తారు. అద్దెకు తీసుకున్న కారులో తిరుగుతూ గేటుకు తాళం వేసి ఉన్న ఇళ్లపై పగలు రెక్కీ చేస్తారు. రాత్రి కన్నం వేస్తారు. మంచాలు, టీవీలను కూడా పట్టుకుపోతారు. చోరీ సొత్తును తాకట్టు పెట్టి లేదా అమ్మేసి ఆ డబ్బుతో విలాసాలు చేస్తారు. అలాంటి నలుగురి ఆట కట్టించారు పోలీసులు. రూ.45 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఈ వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు పంచాయతీ భవానీపురానికి చెందిన గరిమెళ్ల పవన్‌శర్మ కుటుంబంతో గత నెల 15న శ్రీశైలం వెళ్లారు. 20న తిరిగి వచ్చేసరికి ఇంటి గేటు, తలుపు, బీరువా తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. 18 కాసుల బంగారు ఆభరణాలు, 3.50 కిలోల వెండి వస్తువులు దోపిడీకి గురయ్యాయి. శర్మ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. దీనిపై ఎస్పీ నరసింహ కిషోర్ సీరియస్‌గా దృష్టి పెట్టారు. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో 10మందితో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు 15 రోజులు శ్రమించి చివరికి దొంగతో పాటు గ్యాంగ్‌ని కటకటాల్లోకి నెట్టారు. దర్యాప్తులో కొంతమూరు సంతోష్‌నగర్‌కు చెందిన వేమగిరి హరీశ్ గ్యాంగ్ ఆ దొంగతనం చేసినట్టు గుర్తించారు. దర్యాప్తు ముమ్మరం చేసి కచ్చితమైన సమాచారంతో హరీశ్, అదే ప్రాంతానికి చెందిన మోర్త వెంకటేశ్ (వెంకీ), ఇంద్రపాలెనికి చెందిన తణుకు దుర్గాప్రసాద్(సూర్య), తొర్రేడు టిడ్కో గృహ సముదాయానికి చెందిన బండి ధర్మరాజు(గాబ్రియెల్)ను సీఐ వీరయ్య గౌడ్ బృందం అరెస్టు చేసిందని సోమవారం ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అశోక్, రాజేశ్‌ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి చోరీ సొత్తు 301 గ్రాముల బంగారు ఆభరణాలు, 7కిలోల వెండి వస్తువులు, రూ.5 లక్షల నగదు, కారు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, కంచు సామగ్రి, టీవీలు, మంచాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా సుమారు 150గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేయాల్సి ఉందన్నారు.

వయసు 34 కేసులు 40..

నిందితుల్లో హరీశ్ వయసు 34 కాగా 40 కేసులు, వెంకటేష్ (36)పై 34, దుర్గాప్రసాద్ (25)పై ఏడు, ధర్మరాజు(29)పై ఏడు కేసులు ఉన్నాయన్నారు. వీళ్లకు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. దొంగల ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసి భారీగా చోరీ సొత్తును రికవరీ చేసిన సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐలు ప్రియకుమార్, ఏకే సత్యనారాయణ, నాగార్జున, క్రైం సిబ్బంది అమ్మిరాజు, సత్యనారాయణ, కరీం, బీవీ రమణ, సురేశ్, మురళీని ఎస్పీ అభినందించి రూ.50వేల ప్రత్యేక రివార్డును అందజేశారు.

కాకినాడలో సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి

సుబ్బయ్య హోటల్‌లో భోజనం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. పరదా చిత్రం ప్రచారం నిమిత్తం వచ్చిన ఆమె కాకినాడ నగరంలోని సుబ్బయ్య హోటల్‌లో భోజనం చేశారు. దీంతో ఆమెను చూసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు హోటల్‌కి తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా సినీనటి అనుపమ మాట్లాడుతూ సుబ్బయ్య హోటల్ భోజనం అంటే తనకి ఎంతో ఇష్టమని, అందుకే ఇక్కడ భోజనం చేసేందుకు వచ్చానని తెలిపారు.


సుబ్బయ్య హోటల్‌లో భోజనానికి వచ్చిన అనుపమ

స్కీమ్ పేరిట స్కామ్

రూ.1.20 కోట్ల వరకు కట్టించుకుని మోసం

కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు


కోటనందూరులో ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కోటనందూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగారం, పొదుపు స్కీం పేరుతో మోసం జరిగిన ఘటన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బొద్దవరం గ్రామంలో జరిగింది. సుమారు రూ.1.20 కోట్ల వరకు బాధితులు నష్టపోయారు. వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, కుమారులు నారాయణరావు, శ్రీనివాస్ కాకినాడ జిల్లా తుని నక్కినవీధిలో శ్రీశ్రీనివాస జ్యూయలర్ షాపు నడుపుతుండేవారు. వారి వద్ద పలువురు బంగారు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుండేవారు. ఈ పరిచయాన్ని అసరాగా చేసుకుని మహిళలను స్కీం వలలోకి లాగారు. బొద్దవరం గ్రామంలోని పలువురు మహిళల నుంచి నెలనెల సొమ్ములు వసూలు చేసేవారు. సుమారు 36 మంది మహిళలు స్కీంలో చేరి నెలనెల సొమ్ములు కడుతుండేవారు. సుమారు 10 ఏళ్ల నుంచి స్కీం వ్యవహారం సాగుతోంది. మొదట కొన్నేళ్లు సాఫీగానే సాగినా తరువాత స్కీమ్ డబ్బులు వసూళ్లకు రాకపోవడంతో ఆరా తీయగా తునిలో జ్యూయలరీ మూసివేసినట్టు తెలిసింది. వారి స్వగ్రామమైన పాయకరావుపేట మండలం సత్యవరంలో ఇంటికి వెళ్లగా చుట్టుపక్కలవారు నెల రోజుల పైగా ఇంటి వద్ద ఉండడంలేదని తెలిపారు. కూలీనాలీ చేసుకుని నెల నెల వాయిదాల రూపంలో సొమ్ములు కట్టేవారమని, ఇప్పుడు అర్థాంతంగా షాపు మూసివేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సోమవారం కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

లారీల చోరీ కేసులో నలుగురి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- రూ.54.88 లక్షల విలువైన ఆయిల్‌ప్యాకెట్లు, నూకల నిల్వలు స్వాధీనం
- రెండు లారీలు, ట్రాక్టర్ సీజ్


నిందితుల అరెస్టు చూపుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు, ట్రాక్టర్

పిఠాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సంచలనం కలిగించిన ఆయిల్‌ప్యాకెట్లు, నూకల లోడు లారీల చోరీ కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. రెండు లారీలు, ట్రాక్టర్‌తో పాటు చోరీకి గురైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పిఠాపురంలో సోమవారం సాయంత్రం విలేకర్లకు సీఐ జి.శ్రీనివాస్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

పిఠాపురంలోని కుంతీమాధవస్వామి గుడి వద్ద ఈనెల 5న రాత్రి ఉంచిన లారీని రూ.26.83 లక్షల విలువైన ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ప్యాకెట్లుతో సహా చోరీ చేసినట్టు కాకినాడకు చెందిన దగ్గు అప్పారావు ఈనెల 6న ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా డ్రైవర్స్ కాలనీ వద్ద ఉంచిన నూకల లోడు లారీని గుర్తు తెలియని ఆగంతుకులు దొంగలించినట్టు ఆకుల ప్రసాద్ ఫిర్యాదు చేయగా పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో 2 కేసులను నమోదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ పర్యవేక్షణలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలు మణికుమార్, జానీబాషా, ఎన్.రామకృష్ణ, వెంకటేష్ ఆధ్వర్యంలో 5 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ సాగించారు. చేబ్రోలు నుంచి వజ్రకూటం వెళ్లే ఎలబంద పుంతరోడ్డులో యాల లక వారి గరువు వద్ద నిందితులు ఉన్నట్టు గుర్తించారు. అనంతరం పిఠాపురం పట్టణం బొజ్జావారితోటకు చెందిన బెల్లంకొండ రవితేజ, కోటగుమ్మం ప్రాంతానికి నాగిరెడ్డి నాగ సతీష్, లయన్స్‌క్లబ్ ఏరియాకు చెందిన గంజి సురేష్, పండూరుకు చెందిన శంఖవరం మండలం మండపంలో నివాసముంటున్న నందిపాటి వీర సుబ్రహ్మణ్యంలను అరెస్టు చేశారు. వారి నుంచి చోరీకి గురైన 2 లారీలు, సరుకు రవాణాకు వినియోగించిన ట్రాక్టర్, ట్రక్‌లు, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు బాక్సులు, నూకలతో కూడిన కోళ్లమేత బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.54.88 లక్షలుగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని, 63సన్‌ఫ్లవర్ ఆయిల్‌బ ండిల్స్ స్వాధీనం చేసుకోవాల్సి ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు. కాగా నిందితుల్లో ప్రధాన వ్యక్తిగా ఉన్న బెల్లంకొండ రవితేజ గతంలో కాకినాడ పోర్టు నుంచి బియ్యం లోడు లారీ చోరీ కేసులో నిందితుడిగా ఉన్నట్టు తెలిపారు.

నిందితులు... జనసేనతో సంబంధాలు!

అరెస్టయిన నిందితుల్లో ముగ్గురు జనసేన పార్టీకి చెందిన వారున్నట్టు చెప్తున్నారు. వీరిలో ఒకరు లారీ యూనియన్ పదవి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సాగించారు. వీరు కొందరు జనసేన కీలక నేతలతో దిగిన ఫోటోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పోలీసులు మాత్రం అధికారికంగా ధృవీకరించడం లేదు.

బైక్ ఢీకొని భార్య మృతి

భర్తకు స్వల్ప గాయాలు


మృతిచెందిన రాఘవ

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారి దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో గండేపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన జనపరెడ్డి రాఘవ(59) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్తకు స్వల్పగాయాలయ్యాయి. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం గోపాలపురానికి చెందిన జనపరెడ్డి సత్యనారాయణ, తన భార్య రాఘవతో కలిసి మోపెడ్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చిన బైక్ వేగంగా ఢీకొంది. మోపెడ్‌పై వెనుక కూర్చున్న రాఘవ కిందపోయింది. ఆమె తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందిందని పోలీసులు తెలిపారు. సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయని, జనపరెడ్డి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆర్.మురళీమోహన్ పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని అక్క మృతి

బయటపడ్డ చెల్లెలు

కడియం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజానగరం మండలం కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన చిక్కిరెడ్డి సరోజిని (28)మృతి చెందింది. వివరాలలోకి వెళితే... కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన సరోజిని కడియం మేకల దిబ్బప్రాంతంలో ఉంటున్న చెల్లి జగతా బుజ్జి ఇంటికి వచ్చింది. ఆధార్‌కార్డుకు ఫోను నెంబర్ లింక్ చేయించుకునేందుకు ఇద్దరూ బ్యాంక్‌కు బయలుదేరారు. ఇద్దరూ నడిచి వస్తుండగా బుర్రిలంక నుంచి రాజమహేంద్రవరం వైపు వె ళ్తున్న టిప్పర్ ఢీకొంది. సరోజికి బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు కడియం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బుజ్జి సురక్షితంగా బయటపడింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్


నిందితులను పట్టుకున్న పోలీసులు

కాట్రేనికోన, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామ శివారులో గంజాయి సేవిస్తున్న వాసంశెట్టి సోమేశ్వర సాయిపవన్, పలివెల కార్తీక్, ముసలి తేజస్వరూప్, మోకా సంతోష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు. నిందితులను ముమ్మిడివరం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 15 రోజులు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

వాడపల్లి ఆలయానికి రూ.12 లక్షల విలువైన బ్యాటరీ కార్లు

ఆత్రేయపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం జెఎస్ఎన్ రాజు కన్‌స్ట్రక్షన్స్ ద్వారా రూ.12 లక్షల విలువైన బ్యాటరీ కార్లను అందజేశారు. ఈనెల 15న కార్లను ప్రారంభించడం జరుగుతుందని డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. దాతలను అభినందించారు.


ఆలయానికి అందించిన బ్యాటరీ కార్లు

రెండు కార్లు, వ్యాను ఢీ

నలుగురికి స్వల్ప గాయాలు



ధర్మవరం వద్ద ప్రమాదానికి గురైన కారు

ప్రత్తిపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం 16 నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం రెండు కార్లు, ఐసర్ వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ధర్మవరం జడ్పీ హైస్కూల్ హైవే క్రాసింగ్ రోడ్డు వద్ద తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న 2 చిన్న కార్లు నిలిపారు. అదే సమయంలో వాటి వెనుక తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న ఐసర్‌వ్యాన్ ఓ కారును బలంగా ఢీకొనడంతో వెనుక కారు ముందు కారును ఢీకొంది. దీంతో వెనుక కారులో ఉన్న నలుగురికిరి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం వల్ల హైవేపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్.. ఏడుగురు విద్యార్థుల అరెస్టు

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా జీపును నడిపి కూల్‌డ్రింక్ షాపులోకి దూసుకెళ్లడమే కాకుండా 2 మోటారు సైకిళ్లను ధ్వంసం చేసిన కేసులో కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ఏడుగురిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు సోమవారం తెలిపారు. ఈనెల 9న ముక్కామల బైపాస్ రోడ్డులో విద్యార్థులు అతివేగంగా జీపును నడిపి 2 మోటారు సైకిళ్లను ఢీకొట్టి నేరుగా కూల్‌డ్రింక్ షాపులోకి దూసుకుపోయారు. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదుతో పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు కేసు నమోదు చేశారు. నలుగురు మైనర్లతో పాటు ముగ్గురు మేజర్లయిన విద్యార్థులను అరెస్టు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

జగజ్జీవనరామ్ విగ్రహం పాక్షిక ధ్వంసం

అంబాజీపేట మండలంలో ఘటన

అంబాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి పరిధిలోని కాకరవారిపేటలో బాబుజగ్జీవనరామ్ విగ్రహం పాక్షికంగా ధ్వంసమైనట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ భీమరాజు, ఎస్ఐ చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో చర్చించి దర్యాప్తు చేపడతామని తెలిపారు. డాగ్‌స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ సేకరించారు. అనంతరం విగ్రహానికి మరమ్మతులు చేపట్టి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసినట్టు తెలిసింది. అయితే విషయం బయటకు వెళ్లకుండా ఇటు స్థానికులు, అటు పోలీసులు సమాచారాన్ని గోప్యంగా ఉంచారు.

25 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం లారీతో అధికారులు

రాజానగరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు రవాణా చేస్తుండగా విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు సోమవారం నిర్వహించిన తనిఖీల్లో పాలచర్లలో 25 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుబడినట్టు రాజానగరం మండల సివిల్ సప్లై అధికారి గొలుగూరి బాపిరాజు చెప్పారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదు చేశామని, రికార్డు పరిశీలన నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, పౌర సరఫరాలు వారికి నివేదిక సమర్పించనున్నట్టు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.11, 50,000 కాగా, లారీ విలువ రూ.10 లక్షలుగా అంచనా వేశామని, కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ వంట పాటి సురేంద్రను విచారించామన్నారు. తనిఖీల్లో రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ తహశీల్దార్, సహాయ పౌరసరఫరాల అధికారి తదితరులు ఉన్నారు.

బియ్యం బస్తాల చోరీకి యత్నం

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కాటకూటేశ్వరంలోని గోడౌన్ల వద్ద ఆదివారం రాత్రి 100 కిలోల ఉండే 2 బియ్యం బస్తాలను వాచ్‌మెన్ దొంగిలించుకుపోతుండగా పట్టుకున్నారు. సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిపై మూకదాడి

వృద్ధుడి పరిస్థితి విషమం

అమలాపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇంటిపై ఖాళీ బీరు బాటిల్ విసిరాడన్న నెపంతో యువకుడి ఇంటిపై మూక దాడి చేశారు. యువకుడికి అడ్డుగా వెళ్లిన వృద్ధుడికి తలపై బలమైన గాయమై పరిస్థితి విషమంగా ఉంది. అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సోమవారం విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బండారులంక శివారు అరటి మామిడితోట ప్రాంతానికి చెందిన యువకుడైన ఇళ్ల సత్యగోపాల్, వాసంశెట్టి లక్ష్మి కుటుంబాల మధ్య కొంతకాలం క్రితం వివాదరం నెలకొంది. లక్ష్మి ఇంటిపైకి సత్యగోపాల్ బీరు బాటిల్ విసిరాడన్న నెపంతో ఆమె బంధు వర్గీయులు మూకదాడికి దిగారు. పక్కపక్కనే ఇళ్లు కావడంతో సత్యగోపాల్‌పై లక్ష్మి వర్గీయులు మూకదాడి చేయడంతో ఆ సమయంలో తాత గుత్తుల బాబూరావు (65) అడ్డుగా వెళ్లాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆదివారం రాత్రి తొలుత ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం ఉన్నత వైద్యం కోసం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్యగోపాల్, బాబూరావు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్యగోపాల్ ఫిర్యాదు మేరకు మూకదాడికి పాల్పడిన గొవ్వాల సతీష్, దొమ్మేటి మహేష్, గొవ్వాల నాగేంద్ర, గొవ్వాల నరేంద్ర, గొవ్వాల చైతన్య, గొవ్వాల అరుణ్, గొవ్వాల వెంకన్న, గొవ్వాల సత్తిబాబు, గొవ్వాల ఏసుబాబు, దొమ్మేటి షణ్ముఖరావు, వాసంశెట్టి లక్ష్మిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు. తనపై సత్యగోపాల్, మరికొందరు దాడికి పాల్పడినట్టు లక్ష్మి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు.

మస్కట్ నుంచి స్వగ్రామానికి..

కొత్తపేట మహిళ రాక

కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సిబ్బంది ఏర్పాట్లు


స్వదేశానికి వస్తున్న మరియమ్మ

అమలాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మస్కట్‌లో చిత్రహింసలు పడుతున్న తన భార్యను స్వదేశానికి తీసుకురావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన సాకా చంటి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌లో ఫిర్యాదు చేయగా అధికారులు తక్షణం స్పందించారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించి సాకా మరియమ్మను మస్కట్ నుంచి స్వదేశానికి తీసుకురావడం జరిగిందని డీఆర్వో, కేంద్ర నోడల్ అధికారి కొత్త మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాకా చంటి ఇద్దరు పిల్లల చదువుకు ఆర్థిక స్థోమత లేని కారణంగా తన భార్యను విదేశాలకు పంపాలని నిర్ణయించుకున్నాడని తెలిపారు. కోటిపల్లికి చెందిన వ్యక్తి పరిచయమై కొంత సొమ్మును ఇచ్చి నీ భార్యను నేను విదేశాలకు పంపిస్తానని నమ్మబలికి 2 నెలల క్రితం హైదరాబాద్ నుంచి విమానం ఎక్కించారని, మస్కట్ దేశంలో ఒక ఇల్లు తరువాత మరో ఇంట్లోకి పనికి మార్చారని, భోజన వసతులు లేకపోవడంతో శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ సాకా మరియమ్మను పనిచేయించే వారని, ఫోన్ కూడా అందుబాటులో లేకుండా చేశారంటూ భర్త వాపోయాడు. ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా ఆమెను స్వగ్రామానికి తీసుకురావాలన్న కలెక్టర్ ఆదేశంతో కేసీఎం సెంటర్ ద్వారా సిబ్బంది మస్కట్‌కు పంపిన ఏజెంట్‌ను పిలిపించి ఇరుపక్షాలను కూర్చోబెట్టి సంప్రదింపులు జరిపి మరియమ్మను స్వదేశానికితీసుకొచ్చామని డీఆర్వో చెప్పారు.

పంటకాల్వలో వ్యక్తి మృతి


సత్యనారాయణ(ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లికి చెందిన కనికల వీర వెంకటసత్యనారాయణ(51) శనివారం సాయంత్రం పంటకాల్వలో తూర మారుస్తుండగా ప్రమాదవశాత్తూ మునిగి మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెం వద్ద సుమారు 50 ఏళ్ల మహిళ మృతదేహం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో కొట్టుకొస్తుండగా స్థానికులు గుర్తించి ఒడ్డుకు తీశారు. దీనిపై సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

మామిడికుదురు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదరు గ్రామానికి చెందిన అడ్డాల సూర్యావతి (64) ఈనెల 2న అదృశ్యమైంది. కాగా ఆమె మృతదేహం గోగన్నమఠం గ్రామంలో సోమవారం లభ్యమైంది. ఆమె మనుమడు చేపూరి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

కోటనందూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. కోటనందూరుకు చెందిన పోటనూరి కా వ్యశ్రీ(19) ఈనెల 9న రాత్రి 7.30 గంటలకు ఇంటి నుంచి మెడికల్ షాపునకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో తండ్రి అప్పారావు కోటనందూరు పోలీ స్స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె మొబైల్ వాట్సప్‌ను పరిశీలించగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మాదవ్ గణేష్‌తో వెళ్లినట్లు అనుమానంగా ఉందన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కావ్యశ్రీ ఆచూకీ తెలిస్తే 8500811 240లో తెలియజేయాలని కోరారు.

సొసైటీలకు చైర్మన్ల నియామకం
మామిడికుదురు,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా కామిశెట్టి వెంకట్రావు (బాబ్జి), సభ్యులుగా పాటి గోవిందరావు, తులా ఆదినారాయణ, ముత్యాలపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా సాగి వెంకటనరసింహరాజు, సభ్యులుగా నంద్యాల వెంకటతాతయ్యనాయుడు, కొల్లు సీతారామ్‌ను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులిచ్చారు.

భగవద్గీత శ్లోకాల పోటీల్లో ప్రథమ బహుమతి
అంబాజీపేట, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మార్చిలో మైసూరు దత్తపీఠంలో జరిగిన భగవద్గీత శ్లోకాల పరీక్షల్లో అంబాజీపేటకు చెందిన దొండపాటి విశాలాక్షి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆల్‌ఇండియాలో లెవెల్‌లో జరిగిన పోటీల్లో ఆమెతో పాటు పాటు పది మంది ప్రథమ స్థానంలో నిలిచారు. నగదు, సర్టిఫికెట్, స్వామివారి ఫొటో అందజేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతుల వెల్లువ

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందించిన జిల్లా ప్రజలు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు, కముజు వరలక్ష్మి తదితరులు

అమలాపురంటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారాన్ని కోరుతూ జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందించారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గ్రామంలోని శ్రీఏకాదశముఖి అంజనేయస్వామివారి దేవస్థానానికి సంబంధించిన భూమి అన్యాక్రాంతమైన వ్యవహారంపై ఆలయ అర్చకుడు ఆకొండి సత్యనారాయణ కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. దేవస్థానానికి చెందిన భూమి అయినవిల్లి మండలం మదుపల్లి గ్రామంలో సర్వే నంబరు 104లో 72 సెంట్లు భూమి ఉందని, ఆ భూమిని తాళ్లరేవు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఈవిషయంపై ఇప్పటికే దేవదాయశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందించానన్నారు. అదేవిధంగా అనేక సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందించారు.

సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చండి: తల్లి ఆరుద్రతో దివ్యాంగురాలు సాయిలక్ష్మిచంద్ర

ముఖ్యమంత్రి చంద్రబాబు చెయ్యేరు పర్యటనకు వచ్చినప్పుడు ప్రజావేదికలో భాగంగా కలిసిన దివ్యాంగురాలు రాజులపూడి సాయిలక్ష్మి చంద్రకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు దివ్యాంగుల కోటాలో ప్రభుత్వం ఇళ్ల నిర్మించి ఇచ్చే విధంగా మాట ఇచ్చారు. 90శాతం దివ్యాంగురాలైన తాను అనారోగ్యంతో కదలలేని పరిస్థితిలో ఉన్నందున ప్రభుత్వ సాయం అందించాలని అర్జీలో కోరారు. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఇంటి స్థలం అందించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం మాలమహానాడు నాయకుల నిరసన

ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి ఎస్సీ వర్గీకరణ చేయడంతో మాలలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కలెక్టరేట్ ఎదుట మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్సీ జనాభా, విద్యా, ఉద్యోగాలకు సంబంధించిన సరైన సమాచారం లేకుండానే 59ఉపకులాల్లో కేవలం మాదిగలకు లబ్ధి చేకూర్చి ఓటు బ్యాంకు పొందాలని చేసిన వర్గీకరణతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. జేఏసీ నాయకులు చీకురుమెల్లి శ్రీనివాస్, పరమట రామ్‌ప్రసాద్, కాశి వెంకట్రావు, సాపే ధర్మరాజు, ఊటాల వెంకటేష్, రొక్కాల నాగేశ్వరరావు, మెండి డేవిడ్ అంబేడ్కర్, బడుగు సత్యనారాయణ, ములపర్తి సత్యనారాయణ, గెద్దాడ బుద్ధరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వితంతు పెన్షన్ ఇప్పించండి : ఇద్దరు బిడ్డలతో అరుణ, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం మండలం

ఏడాదిన్నర క్రితం భర్త అనారోగ్యంతో చనిపోయాడు. వితంతు పెన్షన్ కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగినా మంజూరు కాలేదు. ఇద్దరు బిడ్డలకు కుటుంబాన్ని పోషించడం భారంగా ఉంది. వితంతు పెన్షన్ మంజూరుచేయాలని కలెక్టరేట్‌లో అర్జీ అందించింది.

కొబ్బరిచెట్ల ఫలసాయం పంచాయతీకే చెందాలి : గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ వార్డు సభ్యులు

గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయం పంచాయతీకే చెందాలని కోరుతూ పంచాయతీ వార్డు సభ్యులు కలెక్టర్‌కు అర్జీ అందించారు. మైనరు పంచాయతీ కావడంతో నిధుల కొరతతో గ్రామాభివృద్ధి కష్టంగా ఉంది. కొబ్బరి చెట్లకు వేలం నిర్వహించడం ఇష్టంలేని కొందరు వ్యక్తులు దొంగతనంగా ఫలసాయాన్ని పాడుచేశారని అర్జీలో వివరించారు. సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు, వార్డు సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, పేరాబత్తుల భూషణం, ముత్తాబత్తుల సత్యవతి, చాగంటి గంగాభవానీ, కేతా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నూజివీడు వెళ్లి చదువుకోమంటున్నారు : హార్టీకల్చర్ యూనివర్శిటీ విద్యార్థులు

రామచంద్రపురం డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీలో రెండేళ్ల డిప్లమో ఇన్ హార్టీకల్చర్ కోర్సులో చేరాం. మొదటి సంవత్సరం పూర్తయింది. రెండో సంవత్సరం చదువుకునేందుకు కళాశాలకు వెళ్తే విద్యార్థులందరినీ నూజివీడు బ్రాంచికు బదిలీ చేసినట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ చినబాబు తెలిపారు. రామచంద్రపురం కళాశాలను మహిళా కళాశాలగా మార్చామని చెబుతున్నారు. మొదటి సంవత్సరం కోర్సులో మహిళలను చేర్చుకుని రెండో సంవత్సరం మా విద్యను పూర్తి చేయాలని అభ్యర్థించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేశాం. మేమంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారం. మాకు న్యాయంచేసి చదువును కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్.మణికుమార్, పి.ఆనంద్‌కిశోర్, కె.భరత్‌లు కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

ఇళ్లస్థలాలు ఇప్పించండి : కముజు వరలక్ష్మి తదితరులు, లంకాఫ్‌ఠాణేలంక

ఇళ్ల స్థలాల కోసం ఎన్నోసార్లు దరఖాస్తులు చేసుకున్నాం. గ్రామంలో గత ప్రభుత్వం కొందరికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇచ్చింది. స్థలం కొరతతో ఇవ్వలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇళ్ల స్థల పట్టాలు అందించి ఆదుకోవాలని రాయుడు వెంకటలక్ష్మి, కముజు వరలక్ష్మి, బొక్కా గంగాభవానీ, గంజా అరుణకుమారిలు అర్జీ అందించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

అల్లవరం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): అల్లవరంలో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేద్దామంటూ నినాదాలు చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి అల్లవరం ప్రధానరహదారిలో ర్యాలీ సాగింది. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో బి.లక్ష్మణరావు డిప్యూటీ తహశీల్దార్ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మండల పరిషత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, గ్రేస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, ఏపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల సత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, అన్నాబత్తుల హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నగరపంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది కార్యాలయం నుంచి త్రివర్ణ పతాకాన్ని చేపట్టి వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, సచివాలయ, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయం నుంచి తహశీల్దార్ టి.సుభాష్, మండలపరిషత్ అధికారి తాడి శ్రీవెంకటాచార్యల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ మండల అభివృద్ధి అధికారిణి సీహెచ్ లక్ష్మీకల్యాణి, మండల రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ సోమవారం నిర్వహించారు. తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో మల్లికార్జునరావులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, వేణుగోపాల్, మధుసూదనరాజు, మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జెండాఎగరాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,ఎంపీడీవో ఏవీఎల్ నరసింహం అన్నారు. హర్‌ఘర్ తిరంగా ర్యాలీని స్థానిక హైస్కూల్ నుంచి సెంటర్ వరకు నిర్వహించారు. తహశీల్దారు చినబాబు, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఏపీవో ఏ.వెంకట కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మామిడికుదురు దీప్తి స్కూలు నుంచి బస్టాండు కూడలి వరకు జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ వందేమాతరం, భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, కంకిపాటి సుబ్బారావు, అడపా వెంటకరత్నం, వేగి వెంకటేశ్వరరావు, కోటిపల్లి సాయిబాబు, షంషూ సాదిక్, నక్కా త్రిలోచనరావు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీని సఖినేటిపల్లి రేవు నుంచి టేకిశెట్టిపాలెం వరకు సోమవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడారు. అడబాల రాంబాబు, చెంపాటి శివరామకృష్ణంరాజు, పట్టాపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, వాస్కూరి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే అధికారుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయ అధికారులు, నాయకులు మూడుతూముల వరకు ర్యాలీగా వెళ్లారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీడీవో సూర్యనారాయణ, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంఈవో కిశోర్, వివిధ శాఖల మండలాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రగతిలో దాతల ప్రోత్సాహం మరువరానిది


అల్లవరం హైస్కూలు వద్ద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యాలయాల ప్రగతి సాధనలో ఆర్థిక సహకారం అందిస్తున్న దాతల ప్రోత్సాహం మరువరానిది ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. విద్యాలయాలను తీర్చిదిద్దడానికి దాతలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. అల్లవరం జడ్పీ హైస్కూలు వద్ద దీపక్ నెక్సజన్ ఫీడ్స్ రూ.7.5లక్షలు, సాయిబాలాజీ ట్రస్టు రూ.4లక్షలతో నిర్మించిన హైస్కూలు ఆడిటోరియాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. సాయిబాలాజీ ట్రస్టు ఆధ్వర్యంలో బండిగుప్తాపు పాండురంగ ఆర్థిక సహకారం రూ.3.50లక్షలతో నిర్మించిన హైస్కూలు సైకిల్ స్టాండ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, దీపక్ ఫీడ్స్ ఎండీ ఏవీ సుబ్రహ్మణ్యం, ఏవీ శేషాద్రి, బండిగుప్తాపు పాండురంగ, డాక్టర్ బసవా వరహాలు, నడింపల్లి సూరిబాబురాజు, హెచ్‌ఎం ఎన్.వెంకటేశ్వరరావు, గెద్దాడ శ్రీనివాస్, సర్పంచ్ బొమ్ము బాలవేణి, సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి గోపాలకృష్ణ, కంకిపాటి వీరబాబు, బీజేపీ నాయకులు సుంకర సాయిబాబా, కట్టా నారాయణమూర్తి, ఎంపీటీసీ ఎన్.మౌనికవరలక్ష్మి, అడపా కృష్ణప్రసాద్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవో5లో నిబంధనలు తక్షణమే తొలగించాలి

యానాం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వం మార్చి17న విడుదల చేసిన జీవో నెం.5తో దళితుల సంక్షేమ పథకాలు నిర్వీర్యం చేసేలా ఉందని, జీవోలోని కొన్ని నిబంధనలు రద్దు చేయాలని యానాం ఎస్సీఎస్టీ యునైటెడ్ ఫోరం సభ్యులు డిమాండ్‌చేశారు. యానాంలోని దళిత గ్రామాలకు చెందిన 36మంది ప్రతినిధులు బృందం పుదుచ్చేరి వెళ్లి అసెంబ్లీ సమీపంలో ఒక్కరోజు ఆందోళన చేపట్టారు. దీనిపై పుదుచ్చేరి గవర్నర్, సీఎంలకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు యానాం మీడియాతో మాట్లాడారు. దళితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు జీవో5లో ఆంక్షలు విధించడంతో సంక్షేమ పథకాలు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. జీవోలోని అంశాలను తొలగించాలన్నారు.. గృహనిర్మాణానికి ఆదాయ పరిమితిని తొలగించి ప్రతి ఒక్క దళితుడికి ఇళ్లపట్టా ఇవ్వాలని, దళిత వధువుకు అందించే పరిహారం రూ.లక్ష నుంచి రూ.1.50లక్షలకు పెంచాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. నాయకులు పొనుగమట్ల విష్ణుమూర్తి, గిడ్డి బలరాం, తిరుకోటి నాగేశ్వరరావు, లంక బంగారం, బోళ్ల జోజీ, యాళ్ల వెంకటకుమార్ పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి కూటమిలోనే చేయూత


ప్రధానమంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి.

పి.గన్నవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, నాయీబ్రాహ్మణుల కష్టాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను కల్పించిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో, బారుల్లో 10శాతం అవకాశం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, కో-కన్వీనర్ దాసరి వీరవెంకటసత్య నారాయణ, బొంతు పెదబాబు, మట్టపర్తి రామకృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, జాలెం శ్రీనివాసరాజా, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, యల్లమిల్లి చిట్టిబాబు, పెనుమారెడ్డి నాయుడు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం ఆసుపత్రిలో సాయంత్రం వరకే వైద్యం

- ఒకే ఒక్క స్టాఫ్‌నర్సుతో కాలక్షేపం
- రాత్రి సమయంలో అందని వైద్యం
- వైద్యాధికారిపై జనాగ్రహం



ఉప్పలగుప్తం పీహెచ్‌సీ భవనం

ఉప్పలగుప్తం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం 24గంటల ఆసుపత్రి. రాత్రి వైద్యసేవలందించేందుకు తగిన సిబ్బంది లేరు. సాయంత్రం 5గంటల తర్వాత వచ్చిన రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించక తప్పడం లేదు. ఈపీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలు అందిస్తారు. తర్వాత వచ్చే అత్యవసర కేసులను డ్యూటీలో ఉన్న స్టాఫ్‌నర్సు చూడవలసి ఉంది. ఈఆసుపత్రిలో ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాలి. రెండేళ్లుగా రెండు స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రాత్రి సమయాల్లో వచ్చే రోగులను సేవలందించడం ఇక్కడ కుదరడం లేదు. గతంలో ఒక 108 అంబులెన్స్ ఉండేది, రాత్రి సమయాల్లో రోగులకు ప్రాథమిక చికిత్స అందించి, అంబులెన్స్‌లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించేవారు. అయితే వారం రోజుల క్రితం అంబులెన్స్‌ను స్టిక్కరింగ్ నిమిత్తం ప్రభుత్వ ఆదేశాలతో విజయవాడ తరలించారు. దీంతో ఒక్క నైట్ వాచర్ మాత్రమే ఆసుపత్రి వద్ద ఉంటున్నారు. రాత్రి సమయంలో ఏదైనా అత్యవసర కేసు వస్తే వైద్యాధికారికి ఫోన్ చేసి రప్పిస్తున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోతే వేరే ఆసుపత్రికి వెళ్లవలసిందిగా నైట్ వాచ్‌మాన్ సూచిస్తున్నారు. ఈనెల9న సాయంత్రం సుందరనీడి వీరభద్రరావు(14)ను పిచ్చికుక్క కాటేయడంతో పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అయితే అక్కడ సిబ్బంది లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతతో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ సోమవారం జనసేన ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు.

యానాం సమస్యలపై గవర్నర్‌కు వినతి



యానాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాశనాధన్ రాజ్‌భవన్‌లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కలిసి వినతి పత్రం అందించి యానాం అంశాలపై చర్చించారు. యానాం జనాభా అనుగుణంగా మినిస్టీరియల్ సిబ్బందిని తగిన నిష్పత్తిలో నియమించాలని కోరారు. గృహనిర్మాణ రుణాలు, పరంపేట యువకుడిపై దాడి, సెంటాక్ ద్వారా వైద్య విద్యా సీట్ల భర్తీలో యానానికి జరుగుతున్న అన్యాయం, ప్రజాపనుల శాఖ, యానాం టూరిస్ట్ గార్డుల, ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూడిలో ఎప్‌టీసీఎల్‌ఆర్ రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై గవర్నర్‌కు వివరించారు. యానాం పర్యటనకు రావాలని గవర్నర్‌ను మల్లాడి కోరారు.

ఉపకరణాల కోసం వైద్య పరీక్షలు

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా శాఖ ఆధ్వర్యంలో సహిత విద్యలో భాగంగా అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలతో పాటు మామిడికుదురు మండలాల నుంచి 106మంది హాజరుకాగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి జి.మమ్మి మాట్లాడుతూ అర్హులైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు త్వరలోనే ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, హెచ్‌ఎం భమిడిపాటి వీఎస్ రామకృష్ణ, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాల వీరులకు నివాళి

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అసువులు బాసిన మాల మృతవీరులకు సోమవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో మాలమహానాడు జేఏసీ జిల్లాశాఖ అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. 1997 ఆగస్టు 11న మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీరావు నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్ సచివాలయాన్ని ముట్టడించిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పాణంగి శేషయ్య, గోపతోటి నారాయణ, మెండి సత్యరామ్‌ల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. తొలుత పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు జేఏసీ నాయకులు పెయ్యల శ్రీనివాసరావు, పెనుమాల చిట్టిబాబు, రొక్కాల నాగేశ్వరరావు, పరమట రాంప్రసాద్, ములపర్తి సత్యనారాయణ, గెద్దాడ బుద్ధరాజ్, మోకా శ్రీను, ఊటాల వెంకటేష్, ఉబ్బన శ్రీనివాస్, కాశి వీవీ సత్యనారాయణ, గిడ్ల శ్యామ్, మెండి డేవిడ్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు

పి.గన్నవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పద మృతిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. లంకలగన్నవరం శివారు నడిగాడి గ్రామానికి చెందిన సరెళ్ల మల్లేశ్వరరావు(43) కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆదివారం రాత్రి వాంతులతో ఊపిరి తీసుకునే పరిస్థితి లేకపోవడంతో 108కు సమాచారం ఇచ్చారు. 108 ఎక్కించే సమయంలో మల్లేశ్వరరావును సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పట్టాభి తెలిపారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

మలికిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చేనేత కళాకారులకు వరాల జల్లు కురిపించిన కూటమి ప్రభుత్వ అధిపతులకు మలికిపురం సెంటర్‌లో చేనేత కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం చేనేత కళాకారులకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, చేనేత భరోసా రూ.25వేలు ప్రకటిచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జరిగిన పాలాభిషేకంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, చేనేత నాయకులు చింతా వీరభద్రేశ్వరరావు, కటకం ధనలక్ష్మీశ్వరరావు, జాన పార్వతీశం, బూసిం రమేష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి


ముక్తేశ్వరం జడ్పీహెచ్ స్కూలులో డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అయినవిల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధునిక డిజిటల్ లైబ్రరీని ఆయన ప్రారంభించారు. అనంతరం కిచెన్‌గార్డెన్, ఆటోమోటివ్ ల్యాబ్, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్స్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఆధునిక విద్యా సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులంతా వాటిని సద్వినియోగం చేసుకుకోవాలన్నారు. హెచ్‌ఎం నిమ్మకయాల గణేశ్వరరావు, తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, మండల విద్యాధికారి మెల్లం శ్రీనివాస్, పెచ్చెట్టి శ్రీనివాస్, కార్యదర్శి మద్దాల సుబ్బారావు, సర్పంచ్‌లు కుడుపూడి శాంతావతి, వారా జయసావిత్రి, కాకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

అయినవిల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. అయినవిల్లిలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14నెలల్లోనే నియోజకవర్గంలో 85శాతం రోడ్లు పూర్తి చేశామన్నారు. మిగిలిన 15శాతం రోడ్లను వచ్చే ఏడాది పూర్తిచేసి నియోకజవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మామిడికుదురు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలియచేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం దివ్యాంగులకు ఉపయోగపడే వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. అందులో బ్యాటరీ వాహనాలు, వీల్‌చైర్స్ తదితర రూ.6.50లక్షలు విలువైన 33 రకాల ఉపకరణాలు అందించారు. ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జనసేన, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు జాలెం శ్రీనివాసరాజా, భైరిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీలు కొమ్మూల జంగమయ్య, కడలి పద్మావతి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, గుబ్బల దుర్గ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి జాతర

అంబాజీపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నందంపూడి గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి జాతరలో గరగనృత్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వీరేశ్వరస్వామికి వెండి కిరీటం బహూకరణ



అంబాజీపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం కౌశిక నదీతీరాన వేంచేసియున్న ఏకాదశ రుద్రల్లో ఒక్కరైన ఉమాపార్వతీ సమేత శ్రీ వీరేశ్వరస్వామికి వెండి కిరీటం, వక్షస్థలం, ప్రభకు ఇత్తడి మకర తోరణం బహూకరించారు. గంగలకుర్రు గ్రామానికి చెందిన తనికెళ్ళ సోమ సూర్యసుబ్రహ్మణ్యవిశ్వేశ్వరరావు కుమారులు వెంకటసత్యసూర్యనాగభూషణం-లక్ష్మి సూర్యపద్మ, రామలక్ష్మినరసింహమూర్తి- పద్మావతి దంపతులు దుర్గావిశ్వనాధం, ఉమాభానులు రూ.1.50లక్షల విలువైన వెండి, ఇత్తడి వస్తువులను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. ఆలయంలో అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్, శిష్టాశివసాయిరామ్ ఆధ్వర్యంలో సంప్రోక్షణ పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం వెండి వస్తువులను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పరామర్శ

ముమ్మిడివరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీహెచ్ గున్నేపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు గొలకోటి రాజబాబు అనారోగ్యంతో హైదరబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజబాబును సోమవారం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ పరామర్శించారు. బాలకృష్ణ వెంట పలువరు వైసీపీ నాయకులు ఉన్నారు.

రాజోలు సబ్‌జైలును పునరుద్ధరించాలి

రాజోలు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాజోలు, అమలాపురం, ఆలమూరు, ముమ్మిడివరం సబ్ జైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్‌లకు న్యాయవాది యాలంగి రమేష్ వినతిపత్రాలు అందజేశారు. రాజోలు కోర్టులో రిమాండు ఖైదీలను సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజోలులో ఉదయం వెళితే సాయంకాలం తిరిగి వచ్చేందుకు ఖైదీలకు సులువుగా ఉండేదన్నారు. ఇప్పుడు రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించడం వల్ల నాలుగైదు రోజులు పడుతుందన్నారు. అందుచేత రాజోలు సబ్ జైలును పునరుద్ధరించాలని కోరారు. జిల్లాలో కొత్తపేటలో మాత్రమే సబ్‌జైలు ఉందన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 28మందికి ఉద్యోగాలు

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 28 మందికి ఉద్యోగాలు లభించినట్లు నల్లా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నల్లా పవన్‌కుమార్ తెలిపారు. నల్లా చారిటబుల్ ట్రస్టు, రిలయన్స్, శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎన్ లేబోరేటరీస్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రిలయన్స్ ప్రతినిధి నాగేశ్వరరావు, ఎంఎస్‌ఎన్ లాబోరేటరీ ప్రతినిధి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి వారి విద్యార్హతలను బట్టి రూ.2.30లక్షల నుంచి రూ.3లక్షల వార్షిక వేతనం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్, కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్, ముళ్లపూడి విజయలక్ష్మి, డాక్టర్ కె.హేమవిజిత తదితరులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులుగా ఎంపికైన వారికి సన్మానం

ఉప్పలగుప్తం, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి పంచాయతీలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన పాము గౌతమ్‌కృష్ణ, చింతలచెరువు చినపేటకు చెందిన జనిపెల్ల శాంతిశ్రీ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్థానికుల ఆధ్వర్యంలో సోమవారం వీరిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ యువత నియోజకవర్గ అధ్యక్షుడు గొలకోటి చిన్నా, సుంకర చిన్నబ్బాయి, రొక్కాల సత్యనారాయణ, జంగా శ్రీనివాసరావు, పొలమూరి సత్యనారాయణ, జంగా వీవీ సత్యనారాయణ, కొల్లు నాగేశ్వరరావు, కొల్లు పెద్దిరాజు, బుంగ పండు, గొలకోటి ఆంజనేయులు, బడుగు అర్జునరావు, రొక్కాల సందీప్, కొల్లు ప్రసాద్, జనిపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన


నూతనంగా ప్రవేశపెట్టిన బుక్‌లెట్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యాధికారి సుబ్రహ్మణ్యం

అంతర్వేది, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నూతనంగా ప్రవేశపెట్టి బుక్‌లెట్‌ను విద్యార్థులు ఏవిధంగా రాస్తారనే అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా కమిటీ టీమ్ బొరుసు సుబ్రహ్మణ్యం, వైవీ సత్యనారాయణ పలు పాఠశాలలను పరిశీలించారు. నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపరు-1 పరీక్షలు, 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బుక్‌లెట్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కమిటీ సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కిశోర్ కుమార్, వెంకటేశ్వరరావు, సిబ్బంది రాజబాబు, సంధ్యాదేవి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

మామిడికుదురు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు హైస్కూలులోని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సర్వశిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్కూలులో ఫార్మేటీవ్ అసెస్‌మెంట్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి అసెస్మెట్ బుక్‌లెట్‌లో విద్యార్థులు పరీక్షలు ఏవిధంగా రాస్తున్నారో పరిశీలించారు. కార్యక్రమంలో మలికిపురం ఎంఈవో వైవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు పి.చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీని అభివృద్ధి చేయాలి

పి.గన్నవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలను త్రిసభ్య కమిటీ సభ్యులు అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. సోమవారం పి.గన్నవరం సొసైటీ చైర్‌పర్సన్, సభ్యులు బాధ్యతలు తీసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ రాయితీలు అందేలా కృషిచేయాలన్నారు. తొలుత ఎమ్మెల్యేతో పాటు త్రిసభ్య కమిటీ సభ్యులకు కార్యాలయం కార్యదర్శి సోమేశ్వరావు స్వాగతం పలికారు. టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సంసాని పెద్దిరాజు, శిరిడినీడి వెంక టేశ్వరరావు, అల్లాడ రవి, అన్నాబత్తుల హనుమాన్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మండపేట



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆదాయం రూ.3.90 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,90,376 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు. ఆలయంలో చేపడుతున్న పనులు, ఆలయ ద్వారాల వెడల్పు వంటి పనులను ఉపకమిషనరు సూర్యచక్రధరరావు పరిశీలించారు. ఆలయం ఎదురుగా ఉన్న స్వాతంత్ర సమరయోధుల స్థూపాన్ని తరలించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసే పనులను ఆయన పరిశీలించారు.

పీఎం బీమా యోజనకు మూడు రోజులే గడువు

ఆలమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పీఎం పసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు వ్యవసాయశాఖ సబ్ డివిజనల్ అధికారి సీహెచ్‌కెవీ చౌదరి సూచించారు. ఈనెల 15వ తేదీతో పీఎం పసల్ బీమా నమోదు ముగుస్తుందన్నారు. రైతులంతా ఈ పథకంలో చేరాలన్నారు. ఆలమూరులో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేవలం రూ.76 ప్రీమియంతో ఎకరానికి రూ.38వేల బీమా పొందవచ్చునన్నారు. కౌలు రైతులతో సహా రైతులంతా ఈ పథకంలో చేరడానికి అర్హులన్నారు. మరిన్ని వివరాలకు స్థానికంగా ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని రైతులకు ఆయన సూచించారు.



ఏడీఏ చౌదరి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, కూటమినేతలు

గీత కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

గీత కార్మికుల సభలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో పది శాతం దుకాణాలను కేటాయించిన నేపథ్యంలో శెట్టిబలిజ కల్యాణ మండపం వద్ద సీఎం చంద్రబాబుకు గీత కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాదా ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ సీహెచ్ రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సహకార సంఘ అధ్యక్షుడు కుక్కల రామారావు, టీడీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు చీకట్ల గోవిందరాజు, శెట్టిబలిజ సంఘ పట్టణ అధ్యక్షుడు బండి గోవిందు, తాపేశ్వరం మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘వ్యవసాయంలోకి కార్పొరేట్ సంస్థలు వద్దు’

కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన



మండపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలోకి కార్పొరేట్ సంస్థలను రానివ్వొద్దంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నామని ఆ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. ఏడిద రోడ్డులో వున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లో నిరసన చేపడుతున్నామన్నారు. ఈనెల 13న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే నిరసన ర్యాలీలో ప్రజలు, రైతులు కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

రాహుల్ అరెస్టు అప్రజాస్వామ్యం

రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అమానుషమని కామన ప్రభాకరరావు అన్నారు. రాహుల్ అరెస్టును ఆయన ఖండించారు. లోక్‌సభలో ఆయన్ను ఎదు ర్కొనే సత్తాలేక ఈ తరహా అరెస్టు లకు పాల్పడుతోందన్నారు. తక్షణమే ఆయన్ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏపీపీగా బాధ్యతలు స్వీకరించిన సునీల్

ఆలమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆలమూరుకు చెందిన న్యాయవాది కె.సునీల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ న్యాయమూర్తి రామచంద్రపురం కోర్టు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించడంతో సోమవారం కాకినాడ సెషన్స్ కోర్టులో బాధ్యతలు తీసుకున్నారు. రెండు దశాబ్దాలుగా ఆయన న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఆయన సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం కోనసీమ జిల్లా కోర్టు రామచంద్రపురం సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో సోమవారం ఆయన కాకినాడలో బాధ్యతలు స్వీకరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సునీల్‌కుమార్

పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు

ఆలమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తురగా పబ్లికేషన్ అధినేత టి.కృష్ణకుమార్ అన్నారు. చింతలూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలకు పబ్లికేషన్ ద్వారా విద్యార్థులకు ఉపకరించే పుస్తకాలను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్‌లకు అందించారు. ప్రతిరోజు పఠనం చేసేలా విద్యార్థులను చైతన్యవంతం చేయాలని ఆయన అన్నారు. పుస్తకాలు అందించిన దాత కృష్ణకుమార్‌ను పలువురు అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతి

కపిలేశ్వరపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సోమవారం ప్రోత్సాహక నగదు బహుమతులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఒక సామాజిక విద్యాదాత పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన పేపకాయల ప్రసన్న, ద్వితీయస్థానం సాధించిన అరవపల్లి ఈశ్వరి, తృతీ యస్థానం సాధించిన కర్రి జాహ్నవిలకు ఒక్కొక్కరికి రూ.10,116 చొప్పున నగదు అందజేశారు. ఈసందర్భంగా దాత మాట్లాడుతూ చదువుల్లో మరిన్ని విజయాలను సాధించి గ్రామానికి, పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, కొమ్మిశెట్టి సూరిబాబు, దానేటి శరత్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.



అంగరలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం

ఆత్రేయపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో సోమవారం అభ్యుదయ రైతు కుదప కృష్ణమూర్తి వ్యవసాయ క్షేత్రంలో పచ్చపురుగు, గొంగళిపురుగు నివారణకు 100 లీటర్ల బ్రహ్మాస్త్రం తయారు చేసే విధానాన్ని రైతులకు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు.



ఆలమూరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు





కె.గంగవరంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజలు. పక్క చిత్రంలో రామచంద్రపురంలో జరిగిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు

ప్రతి ఒక్కరూ జాతీయభావం పెంపొందించుకోవాలి

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు, 11(ఆంధ్రజ్యోతి):ఎందరో మహనీయుల పోరాటాల వల్లే దేశానికి స్వాతంత్రం వచ్చిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో సోమవారం రథం గుడి సెంటరు నుంచి కేపీ రోడ్డులో వున్న కలవపువ్వు సెంటరు వరకు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సారధ్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. తొలుత రథం గుడి సెంటరు నుంచి ప్రారంభమైన ర్యాలీని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా 500 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు, మెప్మా, మున్సిపల్ సిబ్బందితో కలిపి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఇళ్లపై జాతీయ జెండాను ఎగుర వేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీరప్రకాష్, 17వ వార్డు కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, పాలచర్ల శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడిదలో ర్యాలీ

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఏడిద పంచాయతీలో హరఘర్ తీరంగ ర్యాలీ జరిపారు. పంచాయతీ కార్యాలయం నుంచి జాతీయ పతాకాలను చేత పట్టుకుని ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు, ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి తదితరులతో పాటు సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నినాదాలతో ర్యాలీ

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆలమూరులో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీలో జాతీయ నినాదాలతో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పలుశాఖ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో సోమవారం అధికారులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేశారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు, తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, ఆర్ఐ వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ

రామచంద్రపురం(ద్రాక్షారామ)(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ భారీ త్రివర్ణ పతాకంతో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో దేవరకొండ అఖిల, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కమీషనర్ రాజు, ఉద్యోగులు, విద్యార్థులతో రాజగోపాల్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఈ శ్రీకాంత్, బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవహారం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన హరఘర్ తిరంగ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వర రావు, డిప్యూటీ ఎంపీడీవో చిన్నబ్బులు, ఎంఈవో ప్రసాదరావు తదితర అధికారుల బృందం బస్టాండ్ వద్ద మానవహారం జరిపారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు తిరంగ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా ర్యాలీ జరిపారు.

జాతీయ జెండాలతో ర్యాలీ

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ జాతీయభావం పెంపొందించుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు అన్నారు. సోమవారం మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో వారు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారం జరిపారు. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, నాయకులు బలవరెడ్డి సత్తిబాబు, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి శ్రీరాంజీ, ఎంపీహెచ్‌ఈవో మల్లికార్జునుడు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరరావు, ఎంఈవో తాతారావు, గ్రామ కార్యదర్శి శివచక్రవర్తి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో నటుడు కృష్ణంరాజు సతీమణి పూజలు

ద్రాక్షారామ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం దివంగత నటుడు ఉప్పలపాటి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను సందర్శించి పూజలు జరిపారు. దర్శనం అనంతరం నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

కపిలేశ్వరపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ అన్నారు. సోమవారం నల్లూరులో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో యువతకు, గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరీష్‌కుమార్ మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కె, మహిళా కానిస్టేబుల్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం వద్ద నీరు తక్కువగా ఉండటంతో తేలుతున్న ఇసుక మేటలు

గోదావరికి తగ్గిన జలకళ

రావులపాలెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం జూలై 15 దాటిన తరువాత గోదావరిలో నీరు పోటెత్తి ప్రవహించేది. వర్షాలు అనుకున్నంతగా పడకపోవడంతో గోదావరికి జలకళ తగ్గి ఇసుక తిన్నెలు దర్శనమిస్తున్నాయి. గోదావరికి జలకళ తగ్గడంతో ఈ సీజన్‌లో మత్స్యకారులకు అనుకున్న ఆదాయం లభించలేదు. అయా లంకల్లోకి నీరు ప్రవహించే పరిస్థితి ఏర్పడలేదు.

వెంకన్న ధర్మకర్తల నియామకంపై నోటిఫికేషన్ విడుదల

ఆత్రేయపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన మండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. సోమవారం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్ పాలకమండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను 20 రోజుల్లోపు తమ దరఖాస్తులను తమ కార్యాలయంలో అందించాలని ప్రకటన విడుదల చేశారు.

నేడు పోలమ్మ ఆలయంలో ఆవిర్భావ పూజలు

రాయవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు శ్రీపోలమ్మ అమ్మవారి ఆవిర్భావ పూజలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకట రమణ తెలిపారు. సోమవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి ఏకాహం, భజనలు, భగవద్గీత శ్లోకాల పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, 24 గంటలపాటు అఖండ భజన కార్యక్రమం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సీసీ రోడ్లు

ఆలమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆల మూరులో ప్రభుత్వ కార్యాలయాలు ఒకే కాం పౌండ్‌లో ఉండటంతో వాటికి సీసీరోడ్లు నిర్మించాలని నిధులు కేటాయించారు. ఇటీవల ఎమ్మెల్యే బండారు వాటికి శంకుస్థాపన చేయడంతో సీసీ రోడ్లు నిర్మించే పనులకు శ్రీకారం చుట్టారు. మండల ప్రజాపరిషత్, రెవెన్యూ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, కోర్టు, జాతీయ ఉపాధి హామీ పథకం, డీఆర్‌డీఏ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఒకేచోట ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా కార్యాలయాలకు సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే సూచనలతో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.17లక్షల నిధులు కేటాయించారు. సోమవారం సీసీరోడ్డు పనులను ఎంపీడీవో ఎ.రాజు, ఇంజనీరింగ్ మండల అధికారి వీరభద్రరావు, మండల పరిషత్ కార్యాలయం ఏవో మోహర్ ప్రకాష్, మోదుకూరు సహకార సంఘం అధ్యక్షుడు ఈదల వీర్రాజుతోపాటు పలువురు అధికారులు, నాయకులు పరిశీలించారు.



రోడ్డు నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రపురాన్ని కాకినాడలో కలపాలి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలని కోరుతూ సోమవారం న్యాయవాదులు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలిపేందుకు తీర్మానించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. త్వరలో తీర్మానం చేస్తామని తెలిపారు. న్యాయవాది మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలో న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, బండి శ్రీనివాసరావు, గాలింకి చిట్టిబాబు, గుబ్బల శ్రీనివాస్, కలిదిండి కిరణ్, బొమ్ము మోహనరావు, దివ్యాంగులు ఐక్యవేదిక నాయకుడు పలివెల రాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం చాలా దూరం పీడీఎస్‌యూ

రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని పీడీఎస్‌యు నాయకులు బి.సిద్దూ డిమాండు చేశారు. రామచంద్రపురం నుంచి అమలాపురం చేరుకునేందుకు సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. రామచంద్రపురానికి కాకినాడ 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రజలకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో న్యూడెమక్రసీ నాయకులు అంబటి కృష్ణ, వెంటపల్లి బీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిని సత్కరించిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటికి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన హైకోర్టు న్యాయవాది ఆర్కే ఆచార్యులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. ఈ సందర్భంగా దుశ్శాలువాతో ఆచార్యులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ తనకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యేలా సీఎం చంద్రబాబు నాయుడు తెలిపి కృషి చేసినందుకు ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారును కలిసిన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఆర్కే ఆచార్యులు

రామచంద్రపురం మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా రిష్వంత్‌రాయ్

ద్రాక్షారామ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ నియామకం అయ్యారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ శాఖ రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా మంత్రి సుభాష్‌ను రామచంద్రపురం పట్టణానికి చెందిన రిష్వంత్‌రాయ్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా సబ్బతి నాగేశ్వరిని నియమించారు. సభ్యులుగా సలాది పట్టాభిరామయ్య, కేశనకుర్తి వెంక టేశ్వరరావు, ఖండవిల్లి శ్రీనివాసరావు, వల్లు దాక్షాయని, పి.లక్ష్మీ భార్గవి, సలాది పుష్పావతి, గుండారపు నాగమణి, మేడిశెట్టి విజయభాస్కర్, మేకల లక్ష్మి, నారపరెడ్డి బలరామ్, గుణ్ణం వినోద్‌కుమార్, జగ్గంపూడి గనిరాజు, మర్రివాడ చిన్నికృష్ణను నియమించారు. వీరితో పాటు పిఏసీసీఎస్, పెనుమళ్ల త్రీమెన్ కమిటీ చైర్మన్, సహాయ సంచాలకులు వ్యవసాయశాఖ, సర్పంచ్ ద్రాక్షారామ, జిల్లా వ్యవసాయ వాణిజ్యమార్కెటింగ్ శాఖ అధికారి సభ్యులుగా ఉంటారు.

మంత్రికి రుణపడి ఉంటా:

వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకం చేయించిన మంత్రి సుభాష్, సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలకు రుణపడి ఉంటానని రిష్వంత్‌రాయ్ అన్నారు. టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు.

నేడు బైపాస్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

సినీ నటుడు నారా రోహిత్ హాజరు

రామచంద్రపురం(ద్రాక్షారామ) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బైపాస్ రోడ్డులో మంత్రి సుభాష్ ఏర్పాటు చేసిన దివంగత ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ మంగళవారం జరగనుంది. ఈ కార్యక్రమానికి సినీనటుడు నారా రోహిత్ హాజరై ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

కోనసీమ యూత్ సమ్మిట్‌లో పాల్గొననున్న రోహిత్: విగ్రహావిష్కరణ అనంతరం చేడవరంలో విజయ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న కోనసీమ యూత్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో రోహిత్ పాల్గొంటారని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, యూత్ సమ్మిట్ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

కొత్తపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో తల్లిపాలు విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేపీ రాజు మాట్లాడుతూ తల్లిబిడ్డ అనుబంధాన్ని పెంచేది తల్లిపాలని, బిడ్డకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందిస్తాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, బీసీహెచ్ పాపారావు, విజయ్‌కుమార్, నాగదీపిక, ఎం.హేమలత, సీహెచ్ నాగశ్రీలక్ష్మి, టి.ప్రసన్నజ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ఆలమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సందిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ, బాలమందిరం సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వీటిని నిర్వహించినట్లు సొసైటీ వ్యవస్థాపకులు కృష్ణశ్రీ తెలిపారు. పాఠశాలలో జెండా వందనం, భారతదేశ ప్రగతి వంటి అంశాలపై బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు స్వాతంత్ర వేడుకల సందర్భంగా బహుమతులు అందిస్తామని తెలిపారు. పోటీల నిర్వహణలో పాఠశాల హెచ్ఎం ఎంవీవీఎస్ఎన్ మూర్తి, కవి కృష్ణశ్రీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన పరీక్షలు ప్రశాంతం

కపిలేశ్వరపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు సోమవారం నుంచి ప్రారంభమైన నిర్మాణాత్మక మూల్యాంకన పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. తొలిసారిగా సమగ్రశిక్ష ప్రవేశపెట్టిన బుక్‌లెట్ విధానంలో ఈ పరీక్షలు జరుగుతున్నట్లు ఎంఈవో-2 ఖండవిల్లి విజయ్‌కుమార్ తెలిపారు. మాచర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షల విధానాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో 903 మంది, ఉన్నత పాఠశాలల్లో 1634 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. తొలిరోజు సోమవారం తెలుగు, గణితం పరీక్షలు జరగ్గా, రెండో రోజు మంగళవారం హిందీ, సైన్సు, మూడో రోజు ఇంగ్లీషు, సోషల్ పరీక్షలు జరగనున్నట్లు ఎంఈవో తెలిపారు.